నవ తెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

1

శనివారం 28 జనవరి 2023

రిలే దీక్షలలో గోసంగి సంఘ నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా సాధనకై బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలలో గోసంగి సంఘం నాయకులు శుక్రవారం పాల్గొన్నారు. బోధన్ నియోజకవర్గ గోసంగి సంఘం అధ్యక్షులు మాజీ సర్పంచ్ కొండపల్లి గంగాధర్, ఎడపల్లి గోసంగి సంఘం అధ్యక్షులు సాదుల వీరేశం, ఇర్నాల గంగాధర్, పత్రి పీరయ్య, రాసరి పీరయ్య, నిరగొండ లక్ష్మన్, సాదుల రాములు, ప్రకాష్ గిరి, రాణంపల్లి ఎల్లప్ప ఈ దీక్షలలో కూర్చున్నారు. ఈ దీక్షలు శుక్రవారం నాటికి 40వ రోజుకు చేరుకున్నాయి. వీరికి ముసుకు గంగారెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, గోసంగి సంఘం జిల్లా అధ్యక్షులు గంధం రాజేష్, న్యాయవాదులు పి.శంకర్, అర్జున్ రాండర్, హనుమంత్‌రావు, నాయక్ సాయిలు తదితరులు సంఘీభావం తెలిపారు. వారికి పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు.

జగిత్యాల ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-తాడ్వాయి

మున్సిపల్ కమిషనర్ బోగ శ్రావణిని తీవ్ర ఇబ్బందులు గురిచేసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం తాడ్వాయి మండల అధ్యక్షులు పాగల సాయిబాబా డిమాండ్ చేశారు. తాడ్వాయి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సంజయ్ మున్సిపల్ చైర్మన్ శ్రావణిని మానసికంగా తీవ్రంగా వేధించారని, ఆ వేధింపులు తాళలేక శ్రావణి తన మున్సిపల్ చైర్మన్ పదవికి రాజీనామా చేయడం బాధాకరమన్నారు. ఆమె రాజీనామా చేస్తూ కంటతడి పెట్టడం అందరినీ వేధించిందన్నారు. బీసీ వర్గానికి చెందిన మహిళ పట్ల ఎమ్మెల్యే తీవ్రమైన ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమన్నారు. దీనిపై ప్రతి బీసీ బిడ్డ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. పద్మశాలి వర్గానికి చెందిన బీసీ బిడ్డను అవమానపరచడం సిగ్గుచేటన్నారు. పద్మశాలీలంతా ఏకమై ఆందోళనకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగుల

సమస్యలను పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్
- సీడీపీవో కార్యాలయాల ఎదుట ధర్నా



కంఠేశ్వర్ : ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/దోమకొండ/ఎల్లారెడ్డి

రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీడీపీవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నూర్జహాన్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి స్వర్ణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారని వీరంతా మహిళలు బడుగు, బలహీనవర్గాలకు చెందినవారే ఎక్కువమంది ఉన్నారని తెలిపారు. గత 40 సంవత్సరాలకు పైగా ఐసిడిఎస్‌లో పని చేస్తూ పేద ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. అయినా వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలేవీ ప్రభుత్వం నేటికీ కల్పించలేదని, దీనివల్ల అంగన్వాడీ ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని తెలిపారు. తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చారని తెలిపారు. పశ్చిమ బెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారని వివరించారు. మన రాష్ట్రంలో అంగన్వాడీవర్కర్ పేరును టీచర్స్‌గా మార్చారని, కానీ టీచర్లతో సమానంగా వేతనాలు, ఇతర సౌకర్యాలు మాత్రం ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. అంగన్వాడీ ఉద్యోగులు 1972 గ్రాట్యుటీ చట్టం వర్తింపజేయాలని సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ఇచ్చిందని, అయినా తెలంగాణ ప్రభుత్వం వీటిని అమలు చేయడం లేదన్నారు. దీనివల్ల వయస్సు పైబడ్డ వాళ్ళు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే మార్చ్ 1,2,3 తేదీలలో సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్వప్న, వాణి, రాజ సులోచన, సునీత, సందీప, జరిన, సూర్య కళ,శివ రాజవ్వ, జ్యోతి, సుమలత, గిరిజ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దోమకొండ : అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు నాగారపు ఎల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీడీపీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. సిడిపిఓ కార్యాలయంలో అంగన్వాడి ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనియెడల 2023 మార్చ్ ఒకటి రెండు మూడు తేదీల్లో మూడు రోజులు పాటు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తామని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు అయిన రాష్ట్రంలోని అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించాలని, వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దుచేసి ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, ఐసిడిఎస్‌కు నష్టం కలిగించే నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రద్దు చేయాలన్నారు. టీచర్లతో సమానంగా అంగన్వాడి ఉద్యోగులకు వేతనం పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. రేషన్ బియ్యాన్ని శుభ్రపరచిన వెహికల్ ద్వారానే సప్లై చేయాలన్నారు. ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్వాడి కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరారు. అంగన్వాడి ఉద్యోగులకు ప్రమాద సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే ఆసరా, కల్యాణలక్ష్మి తదితర సౌకర్యాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నాయకురాళ్లు బాబాయ్, యాదమ్మ, రాణి, అనురాధ, మీనా ఉద్యోగుల పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీస్ కార్యాలయం సిబ్బందికి పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో మార్చి 1,2,3వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెను నిర్వహిస్తామని అన్నారు. చాలా సంవత్సరాల నుంచి ఐసీడీఎస్‌లో పనిచేస్తూ పేద ప్రజలకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్ టీచర్లతో సమానంగా అంగన్వాడీ ఉద్యోగులకు వేతనం పెన్షన్ ఈఎస్ఐ, ఉద్యోగ, భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వివిధ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పేర్కొన్నారు. వేసవికాలంలో ప్రభుత్వ పాఠశాలతో సమానంగా అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా గౌరాధ్యక్షుడు సురేష్ గొండ, జుక్కల్ సీపీఐ(ఎం) నాయకులు శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతీరాం నాయక్, సీఐటీయూ కార్యదర్శి అడ్యాప్పా, అంగన్వాడీ టీచర్లు దేవికర్ణ, విజయలక్ష్మీ, సునీత, పద్మ, వెంకటలక్ష్మి, లలిత, సుమిత్ర, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిటౌన్ : ధర్నాకు మద్దతు తెలుపుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

జీపీల నిధులు గోల్‌మాల్

'డిజిటల్ కీ' ద్వారా నిధులు కాజేసిన కంప్యూటర్ ఆపరేటర్

- ఎంపీఓను నిలదీసిన కార్యదర్శులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా : ఎంపీపీ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీవో, కార్యదర్శులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ నిధులు రూ.2,45,500లను కాజేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఎంపీఓపై ఆయా గ్రామాల కార్యదర్శులు మండిపడ్డారు. కాగా ఎంపీఓ పనితీరుపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని ఎంపీపీ గరిబునిసా నయీమ్ తెలిపారు.

మండలంలో ఏడు గ్రామ పంచాయతీల పరిధిలో రూ.2,45,500 నిధులు.. మండలంలోని పర్మల్ల గ్రామపంచాయతీ 41,500, సజ్జనపల్లి 26,500, మంబోజిపేట 48,500, కోమటిపల్లి 39,500, కన్నాపూర్ 25,500, మేంగారం 33,500, రాంపల్లి 32,500 నిధులను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ ప్రశాంత్ తన సొంత ఖాతాలోకి ఈనెల 24వ తేదీన మళ్లించుకున్నాడు. కార్యదర్శుల వద్ద ఉండాల్సిన డిజిటల్ కీ మండల పంచాయతీ అధికారి ప్రభాకర్ చారి ఆదేశాల మేరకు పంచాయతీ ప్రణాళిక రూపొందించడానికి కంప్యూటర్ ఆపరేటర్ ప్రశాంత్‌కు అప్పగించినట్టు కార్యదర్శులు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు వద్ద డిజిటల్ కి లేవని గత నాలుగు రోజుల నుంచి కంప్యూటర్ ఆపరేటర్ కార్యాలయానికి రాకపోవడంతో అనుమానం వచ్చి ఎంపీఓ ప్రభాకర్‌ను శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు నిలదీశారు. దీంతో గ్రామ పంచాయతీ నిధులు డిజిటల్ కి సాయంతో కాజేశాడని కార్యదర్శులకు చెప్పడంతో అవక్కయ్యారు. పంచాయతీకి వచ్చిన నిధులు ఖర్చు, చేసిన వివరాలు సైతం తమకు తెలియజేయడం లేదని పంచాయతీ కార్యదర్శులు ఆరోపించారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ.. తమకు ఎలాంటి సమాచారం లేకుండానే కంప్యూటర్ ఆపరేటర్ పంచాయతీలకు సంబంధించిన 15 ఆర్థిక సంఘం నిధులను తన సొంత ఖాతాలోకి మళ్లించుకున్నాడని తెలిపారు. పంచాయతీ నిధులు కాజేతకు పాల్పడిన కంప్యూటర్ ఆపరేటర్ ప్రశాంత్‌పై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఎంపీ ఓ ప్రభాకర్ చారి ఫిర్యాదు చేశారు.

ఎంపీఓపై కలెక్టర్కు ఫిర్యాదు చేస్తాం : ఎంపీపీ

మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ నిధులు అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కాజేశారని ఎంపీపీ గరీబుని నిస్సా నయీమ్ తెలిపారు. ఎంపీఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామపంచాయతీ నిధులు డిజిటల్ కి సాయంతో తన సొంత ఖాతాలో జమ చేసుకొని అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు నగరానికి కేటీఆర్

- కళాభారతి నిర్మాణానికి భూమిపూజ చేయనున్న మంత్రి
- మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ



కళాభారతి నమూనా

నవతెలంగాణ-కంఠేశ్వర్

అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ఐ.టీ, పురపాలక శాఖ మంత్రి కే.తారకరామారావు శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ సి.నారాయణరెడ్డి, పోలీస్ కమిషనర్ కేఆర్.నాగరాజు, అదనపు కలెక్టర్‌లు చిత్రా మిశ్రా, చంద్రశేఖర్‌తో కలిసి ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. రూ.50 కోట్ల అంచనా వ్యయంతో పాత కలెక్టరేట్ వద్ద నూతనంగా చేపట్టనున్న కళాభారతి ఆడిటోరియం నిర్మాణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, కంఠేశ్వర్ రైల్వే అండర్ బ్రిడ్జ్‌ను ప్రారంభించనున్నారు. అంతకు ముందు భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో జరుగనున్న కార్యక్రమంలో మంత్రి పాల్గొని రైతులతో ముఖాముఖి భేటీ కానున్నారు.

ఈ నేపథ్యంలో కలెక్టర్‌పై ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. హెలికాప్టర్ ద్వారా మంత్రి హాజరవుతుండడంతో, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని హెలిప్యాడ్‌ను సందర్శించి అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా మంత్రి కేటీఆర్ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రతా పరంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్అండ్‌బీ ఎస్.ఈ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మురళీ మనోహర్‌రెడ్డి, నగర పాలక సంస్థ ఇంజినీర్ రషీద్, ట్రాన్స్‌కో ఏ.డీ.ఈ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా 'సుబేదార్'

నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది రాజ్ కుమార్ సుబేదార్‌ను నిజామాబాద్ జిల్లా న్యాయసేవ అధికార సంస్థలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు జిల్లా న్యాయసేవ సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ఆయనకు జిల్లా సంస్థ తరపున నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లా న్యాయసేవ సంస్థ సభ్యుడిగా, సంస్థ ప్రతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.



పాన్ ఇండియా లీగల్ అవేర్ నెస్ కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించారు. పలు సామాజిక సేవలలో తనదైన ముద్ర వేశారు. నిజామాబాద్ బార్ అధ్యక్షుడుగా పనిచేశారు. సుబేదార్ నియమాకం పట్ల బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు కృపాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, జె.వెంకటేశ్వర్, దాసరి పుష్పమిత్ర, ఎన్.సంతోష్, మంచికట్ల గోవర్ధన్ అభినందనలు తెలిపారు. న్యాయసేవ సంస్థ ఉన్నతికి, నేర విచారణలో ఉన్న జైలు ఖైదీలకు సత్వర న్యాయానికి అవకాశం ఉంటుందని వారు అన్నారు. అలాగే డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా న్యాయవాది ఉదయ కృష్ణ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా న్యాయవాదులు శుభం ప్రమోద్‌ను నియమించారు.

బీఆర్ఎస్, బీజేపీ మోసాలను

ఎండగడతాం

- ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ వడ్డేపల్లి సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

బీఆర్ఎస్, బీజేపీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి, ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాడుతుందని, ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి, రంగంపేట, మోషన్‌పూర్, ఉప్పల్వాయి గ్రామాల్లో రెండవరోజు కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన 'హత్ సే హత్ జోడో' పాదయాత్ర జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డితో కలిసి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిస్తూ, ప్రజా సమస్యలు తెలుసుకొని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిరెడ్డి మహేందర్‌రెడ్డి, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కోతి లింగారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో ప్రజలతో మాట్లాడుతున్న సుభాష్‌రెడ్డి

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా స్టాళ్ల ఏర్పాటు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

చిరుధాన్యాలు వినియోగిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మార్కెట్ యార్డ్ ఆవరణలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 సందర్భంగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. చిరుధాన్యాలు ప్రజలు తీసుకోవడం వల్ల పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. చిరుధాన్యాలు తీసుకుంటే వ్యాధులు రావని చెప్పారు. జొన్నలు, సామలు, సజ్జలు, రాగులు రైతులు పండించే విధంగా వ్యవసాయ అధికారులు, విస్తీర్ణ అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. చిరుధాన్యాలతో తయారుచేసిన పిండివంటలను కలెక్టర్ పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. చిరుధాన్యాలతో పిండివంటలు తయారుచేసిన వ్యవసాయ విస్తీర్ణ అధికారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్య, వ్యవసాయ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎస్పీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్..

కంటి వెలుగు శిబిరాన్ని పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కంటి సమస్య ఉన్నవారు ఈ శిబిరం ద్వారా కంటి అద్దాలు, మందులు ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అన్యోన్య కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆయనకు కంటి అద్దాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అందజేశారు. కార్యక్రమంలో నేత్ర వైద్యులు, పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కండ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో

చోరీకి యత్నించిన వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని శాంతపూర్ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఈ నెల 17న ఉదయం 3 గంటల సమయంలో దొంగతనానికి యత్నించిన వ్యక్తి బ్యాంకు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బ్యాంకు డబ్బులు, నగలు, డాక్యుమెంట్లు ఉన్న స్ట్రాంగ్ రూమ్ డోర్ ఓపెన్ చేయగా బ్యాంకులో ఏర్పాటు చేసిన సెక్యూరిటీ అలారం మోగడంతో దొంగ పారిపోయాడు. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజ్‌ల ఆధారంతో చాకచక్యంగా వ్యవహరించి చిన్నతక్కడపల్లి గ్రామానికి చెందిన యాలకంటి మల్లేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ముసుగు ధరించి దొంగతనానికి పాల్పడిన వ్యక్తి సీసీ ఫుటేజ్‌ల ఆధారంతో ఏఎస్ఐ రాజేశ్వర్, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ సురేందర్, కానిస్టేబుల్ నదీమ్ చకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నారని ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇంటి పరిసరాల్లో దుకాణ సముదాయాల్లో ప్రభుత్వ కార్యాలయాలు బ్యాంకుల సముదాయాల్లో సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలని దొంగతనాలు అసాంఘిక ఘటనలు జరగకుండా నివారించవచ్చని ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి కోరారు.

డీఎల్‌డీఏ ఆత్మహత్య బాధాకరం

నవతెలంగాణ-భిక్కనూర్

డీఎల్‌డీఏ డాక్టర్ శ్రీశైలం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని భిక్కనూర్ మండల పశు వైద్యాధికారి దేవేందర్ అన్నారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరంలో వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కోరుట్ల పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాన్ని డీఎల్‌డీఏ డాక్టర్ శ్రీశైలంకు అంకితం చేస్తున్నామని తెలిపారు.

బహుమతి అందుకున్న మహతి స్వచ్ఛంద సంస్థ చిన్నారి

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని పెర్కిట్‌లోగల మహతి స్వచ్ఛంద సంస్థ చిన్నారి రవళి శ్రీ భాషిత పాఠశాలలో నిర్వహించిన డ్రైవింగ్ పోటీలలో విజేతగా నిలిచి బహుమతి అందుకున్నట్టు అధ్యక్షురాలు నిర్మల, సెక్రటరీ నరేష్ కుమారు శుక్రవారం తెలిపారు ఈ సందర్బంగా బిజెపి జిల్లా నాయకులు పల్లె గంగారెడ్డి, కౌన్సిలర్లు పాలెపు రాజు, జీవి నరసింహారెడ్డి లతో ప్రశంస పత్రం అందుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 28న ఉదయం పది గంటలకు విజయ్ హైస్కూల్ ఆర్మూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్టు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస గణేష్, శ్యామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు ఉమ్మడి నిజామాబాద్ (కామారెడ్డి, నిజామాబాద్) జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చుని పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 2.01.2007తర్వాత పుట్టిన వారు అర్హులని, ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 10 నుండి 12 వరకు నిజామాబాద్ జిల్లా విజయ్ హై స్కూల్ ఆర్మూర్ జరిగే 41వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర, బాలికల బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకొని రావాలని ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తి చెప్పారు.

దుమ్ము, ధూళితో అనారోగ్యానికి గురవుతున్నామని

రోడ్డెక్కిన కాలనీవాసులు

- సుమారు మూడుగంటలపాటు బైఠాయింపు
- మొరం, కంకర మిషన్ టిప్పర్లు నిలిపివేత
- పరిష్కారానికి తహసీల్దార్ హామీ

నవతెలంగాణ-మాక్లూర్

ప్రతి రోజు మొరం, కంకర మిషన్ టిప్పర్లు ఇండ్ల పక్కనే ఉన్న రోడ్డుపై వెళ్లడంతో ఇండ్లలోకి దుమ్ము, ధూళి చేరి తమ అనారోగ్యాలకు గురవుతున్నామని, వాటి నుంచి తమను రక్షించాలని కోరుతూ అదే రోడ్డుపై బైఠాయించారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలోని 10వ వార్డువాసులు శుక్రవారం టిప్పర్లనున నిలిపివేసి అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. 20ఏండ్లుగా ఈరోడ్డుపై మొరం, కంకర టిప్పర్లు నడుస్తున్నాయని, తహశీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌కు, ప్రజా ప్రతి నిధులు, ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి, జిల్లా పరిషత్ చైర్మన్ డి. విఠల్ రావుకు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని వాపోయారు. ఈసందర్భంగా సుమారు 25 టిప్పర్లు నిలిచిపోయాయి. కొద్ది రోజుల క్రితమే ఆత్రం గణేష్ అనే యువకుడు దుమ్ము, దూళి వల్ల శ్వాసకోశ వ్యాధితో మృతి చెందాడని తెలిపారు. భోజన సమయంలో ఇంటి కిటికీలు, డోర్లు వేసుకొని తినాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. చిన్నారులకు, వృద్దులకు చర్మ వ్యాధులు సైతం వస్తున్నాయని అధికారులకు తెలిపారు. కాబట్టి టిప్పర్లకు దారిని మళ్లించి లేదా సీసీ రోడ్డు వేసి నడుపుకోవాలని కోరారు. సుమారు మూడు గంటల పాటు రోడ్డుపై కూర్చున్నారు. అనంతరం ఎస్సై యాదగిరి గౌడ్ చేరుకొని స్థానికులు, తహశీల్దార్‌తో మాట్లాడారు, తహసీల్దార్ శంకర్ అరగంటలో వస్తున్నానని చెప్పడంతో అక్కడి ప్రజలు రోడ్డుపై నుంచి లేచిన వాహనాలను ఆపేశారు. తహశీల్దారు వచ్చి స్థానికులతో మాట్లాడారు. సమస పరిష్కరిస్తానని చెప్పడంతో స్థానికులు శాంతించారు. ఒక దశలో సమస్య పరిష్కరించక పోతే పురుగుల మందు తాగి చావడానికైనా సిద్ధమని ఓ వ్యక్తి పురుగుల మందు డబ్బును తీసుకొని వచ్చారు. దీనిని గమనించిన పోలీసులు డబ్బాను తీసుకున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని సీపీఐ(ఎం) ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, మండల కార్యదర్శి కొండ గంగాధర్ వారికి సంఘీభావం తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ మూడు రోజులపాటు ప్రభుత్వ పనులకు అనుమతులు ఉన్నాయని, సోమవారం వారిని పిలిపించి మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అప్పటివరకు రోడ్డుపై నీరు పోసి మెల్లగా నడపాలని టిప్పర్ల యజమానులకు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు రామకృష్ణ, కొమరం కృష్ణ, మాత్రం రాములు, సుమన్, కడప లక్ష్మణ్, కడప నారాయణ, కాలనీవాసుల, మహిళలు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన కాలనీవాసులు

భూకబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ధర్పల్లి



వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుడు

మండలంలోని చల్లగర్ల గ్రామంలోని ఓ వికలాంగుని భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు రాత్రికి రాత్రే చదును చేసి కబ్జాకు పాల్పడుతున్నారని శుక్రవారం తహసీల్దార్ గంగ సాగర్ కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. గ్రామంలోని 182 సర్వేనెంబర్ లో తమకు 3 ఎకరాల 16 గుంటల భూమి ఉందని,నాల్గు రోజులక్రితం గ్రామానికి చెందిన కొందరు తమ భూమిలోని సుమారు 16 గుంటలు కబ్జా చేయడమే కాకా పక్కనే ఉన్న దాటుడు కుంట సైతం కబ్జా చేస్తూ మొత్తం సుమారు 15 ఎకరాలవరకు రాత్రికి రాత్రి ట్రాక్టర్ల సహాయంతో భూమిని చదును చేసి కబ్జ చేస్తున్నారని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వారు తమ పొలానికి వచ్చి విచారణ చేశారని తెలిపారు. తమ భూమి ఇప్పించి, దాటుడు కుంట చెరువు భూమిని కాపాడాలని కోరారు. ఈ విషయంపై తహసీల్దార్ గంగ సాగర్ కు వివరణ కోరగా కబ్జా విషయం తన దృష్టికి వచ్చిందని నేడు తమ సిబ్బందీని పంపించి విచారణ చేసి భూమి కబ్జాకు గురి కాకుండా చూస్తామని హామీనిచ్చారు.

ఉత్తమ సీఈఓగా ఉప్పలవాయి రతన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

74వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, పోలీస్ కమిషనర్ నాగరాజు, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సీఈఓగా ఇందల్ వాయి సహకార సొసైటీ సీఈఓగా ఉప్పలవాయి రతన్‌కు అవార్డును బహూకరించారు. రైతులకు సహాయ సహకారాలు అందజేస్తూ,అందరి మన్ననలు పొందుతూ ఉత్తమ సీఈఓగా ఎంపిక కావడం పట్ల సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి, సహకార సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే రాజీనామా చేయాలి

- టీఆర్ఎస్ పార్టీ పద్మశాలీల మద్దతు కోల్పోతుంది
- జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్



భోగశ్రావణిని కలిసిన పద్మశాలీలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఎమ్మెల్యే డాక్టర్ సంజక్‌కుమార్ రాజీనామా చేయాలి, లేకపోతే టీఆర్ఎస్ పార్టీ పద్మశాలీల మద్దతు కోల్పోతుందని జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ అన్నారు. ఆయనతోపాటు పలువురు శుక్రవారం జగిత్యాలలో భోగ శ్రావణిని కలిసి మద్దతు తెలిపి మాట్లాడారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జగిత్యాల మున్సిపాలిటి చైర్ పర్సన్ పద్మశాలీ అయిన భోగ శ్రావణిని అధికార పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వేధింపులు భరించలేక రాజీనామ చేయడం బాధాకరంగా ఉందని అన్నారు. పద్మశాలి కులస్తులు రాజకీయంగా ఎదగకుండా చేసే కుట్రలో ఇది ఒక భాగంగా అనిపిస్తుందన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పద్మశాలీ కులస్తులు బోగ శ్రావణి కి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో వేసే రాజకీయ అడుగులకు వెంట నడవడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఇలాంటి వేధింపులకు పాల్పడితే బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ వ్యాప్తంగా తమ మద్దతు కోల్పోతుందని హెచ్చరించారు. మండల పద్మశాలి సంఘం నాయకులు మండల అధ్యక్షుడు శ్రీపతి శేఖర్, నిజామాబాద్ రూరల్ పద్మశాలి ఇన్‌చార్జి జగదీష్, తదితరులు ఉన్నారు.

కళాభారతి భూమిపూజకు హాజరు కావాలి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్, గ్రామీణ శాసనసభ్యులు శ్రీ బాజిరెడ్డి గోవర్ధన్ , మరియు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)తో కలిసి కళాభారతి భూమి పూజలో పాల్గొంటారని మండలంలోని అందరు ప్రజాప్రతినిధులు టిఆర్ఎస్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ కుంచాల విమల రాజు శుక్రవారం కోరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ప్రాంగణంలో నూతనంగా 50 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించనున్న "కళాభారతి" భూమి పూజ కార్యక్రమం ఉదయం 10:00 గంటలకు ఉంటుందని అన్నారు. జడ్పిటిసిలు, ఎంపీపీలు, పార్టీ అధ్యక్షులు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, సొసైటీ చైర్మన్లు, సొసైటీ డైరెక్టర్లు, సర్పంచులు ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, మండల యూత్ అధ్యక్షులు, మండల కో ఆప్షన్ మెంబెర్స్, పార్టీ సీనియర్ నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పంటలో చీడపీడలకు ఆందోళన చెందొద్దు

జిల్లా వ్యవసాయ అధికారి రాయుడు తిరుమల ప్రసాద్



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పంటలో చీడపీడలు వచ్చినప్పుడు రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని, అధికారుల సూచన సలహాల మేరకు నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాయుడు తిరుమల ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ తో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. పర్యటనలో భాగంగా పంట నమోదు వివరాలు, పర్యవేక్షణ, చీడపీడల మీద క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు తగు సూచలను సస్యరక్షణ చర్యల పై వివరించారు. వరి కాండం తొలుచు పురుగు, ముడత పురుగు నివారణకు వాడాల్సిన మందుల గురించి వివరించారు. ఆయనతోపాటు వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీహరి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

- ప్రాజెక్టు కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగుల ధర్నాలు

నవతెలంగాణ-భీంగల్/ఆర్మూర్

అంగన్‌వాడీ ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రతకల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్ బాబు, జిల్లా అధ్యక్షురాలు దేవగంగు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణకేంద్రంలోని ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఏసిడిపివోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోవెట్టిచాకిరి చేస్తు చాలీచాలని జీతాలతో కాలంవెళ్లదీస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం వచ్చే బడ్జెట్ సమావేశాల్లో నిధులను పెంచి కనీస వేతనాలు అందించి ఆదుకోవాలని కోరారు. అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యాన్ని ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును అమలు జరిపి గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ప్రమీల,యమున, జ్యోతి, భాగ్యలక్ష్మివసంత మరియు టీచర్లు పాల్గొన్నారు.

ఆర్మూర్ :అంగన్ వాడి ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకుంటే మార్చ్ 1,2,3 తేదీలలో రాష్ట్రవ్యాప్త సమ్మె చేస్తామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పెర్కిట్ సీడీపీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగన్‌వాడీలకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, తదితర చట్టబద్ధ సౌకర్యాలు ప్రభుత్వం నేటికీ కల్పించలేదని అన్నారు మన పక్కనే ఉన్న తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, తమిళనాడు కర్ణాటక రాష్ట్రాలలో అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చినారని, పశ్చిమబెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల్లో రిటర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్, తదితర సౌకర్యాలు కల్పించినారని అన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దుచేసి, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అంగన్వాడి ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలని, 2018 అక్టోబర్ కేంద్రం పెంచిన వేతనం అంగన్వాడి టీచర్లకు 1500, హెల్పర్లకు 750, మినీ వర్కర్లకు 1250 లు రాష్ట్ర ప్రభుత్వం ఏరియల్స్‌తో సహా చెల్లించాలని, జీవో నెంబర్ 14 198ని వెంటనే సవరించాలని అన్నారు. అంగన్వాడీ ఉద్యోగులకు ఆసరా, కల్యాణలక్ష్మి తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకుడు పల్లపు వెంకటేష్, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు చంద్రకళ, సెక్టార్ లీడర్స్ జగదాంబ, సునంద, లక్ష్మి, కవిత, వసంత, అరుణ, కళావతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



భీంగల్‌లో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



ఆర్మూర్‌లో ధర్నా సందర్భంగా మాట్లాడుతున్న రమేష్‌బాబు

కళాశాల టాపర్స్‌కు భూమయ్య అవార్డు

- తల్లిదండ్రులకు సన్మానం
- క్లాస్ టాపర్స్‌కు మెడల్స్ అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిశిత డిగ్రీ కళాశాల (అటానమస్), నిశిత పీజీ కళాశాల నిశిత కామర్స్, సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో శ్రావ్య గార్డెన్లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీంద్ర గుప్త, గౌరవ అతిథిగా టెక్నికల్ క్యాంపస్ హైరింగ్ హెడ్ సౌత్‌రీజియన్ విప్రో శ్రీనవీన్ మంజునాథ్ హాజరయ్యారు. పీజీ 2-జి కాలేజ్ టాపర్స్‌కు భూమయ్య అవార్డు 10వేల క్యాష్, తల్లిదండ్రులకు సన్మానం, క్లాస్ టాపర్స్‌కు, పీజీ విద్యార్థులకు గోల్డ్ మెడల్ విజీవైఅండ్ ఎఫ్‌డి సేమ్ విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్) అందజేశారు. వివిధ కంపెనీలలో సెలెక్ట్ అయిన విద్యార్థులకు వీసి అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలేజ్ చైర్మన్ నిఖిల్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎప్పటికప్పుడు మరింత మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ ప్యాటన్ వినయ్-కుమార్, కో ఆర్డినేటర్ రాజు, డైరెక్టర్ డీఎం షేక్, నిశిత కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ స్వప్న, నిశిత కామర్స్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ జయంత్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వీసీని సన్మానిస్తున్న నిశిత యాజమాన్యం

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

- ఎస్ఐ రాజశేఖర్
  క్రికెట్ టోర్నమెంట్ విజేత కోనాపూర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఆటలు ఆడడంవల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని కమ్మర్‌పల్లి ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. మండలంలోని ఇనాయత్ నగర్ గ్రామంలో అంబేద్కర్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత చెడు మార్గంలో పోకుండా మంచిగా చదువుకోవాలని, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో ఐదుగ్రామాల జట్లు పాల్గొనగా ఫైనల్‌లో ఇనాయత్ నగర్, కోనాపూర్ గ్రామాల జట్లు తలపడ్డాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోనాపూర్ జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు ఎస్ఐ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లస్కర్ నాయక్, నర్సాపూర్ సర్పంచ్ పెండ ప్రభాకర్, అంబేద్కర్ ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు రత్నాకర్, ఆనంద్, వినయ్, అనిల్, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ కేజీబీవీ పాఠశాల విద్యార్థిని ప్రతిభ



నవతెలంగాణ-ముప్కాల్

నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో ముప్కాల్ కేజీబీవీ పాఠశాల విద్యార్థిని వి.ఉమరాణి రెండవ బహుమతిని పొందిందని పాఠశాల ఎస్వో జి.వినోద శుక్రవారం తెలిపారు. కలెక్టర్ నారాయణ రెడ్డి, సీపీ నాగరాజు చేతులమీదుగా బహుమతిని అందుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినిని అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో

పేదింటి అమ్మాయి వివాహం



పుస్తె, మట్టెలు, చీర, సరుకులు అందజేస్తున్న ట్రస్ట్‌వారు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామంలో బచ్చు రాజేందర్, రాజమణి కూతురు వివాహానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటిబుల్ ట్రస్ట్ వారు శుక్రవారం పుస్తె మట్టెలు, 300 మందికి సరిపడా భోజనాలకు సరుకులు, పెళ్లి కూతురుకి చీర అందించారు. సర్పంచ్ సోమ రాజారెడ్డి, ఇబ్రహీంపట్నం పద్మశాలి సంఘం అధ్యక్షుడు గణేష్ పెళ్ళి కూతురికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్ గౌడ్, పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలుక తుకారం, సర్పంచ్ సోమ రాజారెడ్డి, రాంప్రసాద్ గణేష్, కరుణాకర్, ఈశ్వర్, సంఘ సభ్యులు రమేష్, శ్రీనివాస్, దయానంద్, మారుతి, శ్రీకాంత్, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పొలాలు పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ పంట పొలాలను సందర్శించారు. వరి పంట లో కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. దీని నివారణకు రైతులు క్లోరోఫైరిఫాస్ లేదా కార్పాప్ హైడ్రోక్లోరైడ్ మందులను పిచికారి చేయాలని రైతులకు సూచించారు. జింకు లోప నివారణకు జింక్ సల్ఫేట్‌ను పిచికారి చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండమీది గంగాధర్, ఎంపీటీసీ రాజ్ కుమార్, ఏఈఓ శరత్ చంద్ర పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తాళ్ల రామడుగు ప్రభుత్వ పాఠశాలకు రామాలయ కమిటీ, రామాలయ ట్రస్టు ద్వారా రామాలయ కమిటీ శాశ్వత చైర్మన్ బచ్చు పురుషోత్తం గుప్త విద్యార్థులకు కంప్యూటర్స్, ప్రింటర్స్, టేబుల్స్ శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువులో రాణించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరుప్రతిష్టలు తేవాలని కోరారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీఓ లక్ష్మీ ప్రసాద్, ఎస్సై నర్సింలు, సర్పంచ్ ఇజాప లక్ష్మి నర్సయ్య, ప్రధానోపాధ్యాయులు రాములు, ప్రైమరి ప్రధానోపాధ్యాయులు నీరజ, ఉపాధ్యాయులు రాజేశ్వర్, వీడీసీ సభ్యులు, స్థానిక నాయకులు బండారి నరేష్, రాజేశ్వర్, విద్య కమిటీ చెర్మెన్, విద్యార్థుల తల్లి తండ్రులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

నేడు ఎంఆర్ గార్డెన్‌లో
పసుపు రైతుల గోసపై సదస్సు

నవతెలంగాణ-ఆర్మూర్

కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్ లో 'పసుపు రైతుల గోస' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జాతీయ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అనిల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

256 మందికి కంటి వెలుగు పరీక్షలు

- 99 మందికి అద్దాలు పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మోతే, లింగంపేట్ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన కంటి వెలుగులో 256 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు వైద్యాధికారి హిమబిందు తెలిపారు. కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం లింగంపేట గ్రామ పంచాయతీలో 145 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 58 మందికి కంటి అద్దాలు అందజేశామన్నారు. అదేవిధంగా మోతె గ్రామంలో 111 మందికి కంటి వైద్య పరిస్థితి నిర్వహించగా 41 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. మొత్తం రెండు సెంటర్ల పరిధిలో 99 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యాధికారులు సంగీత, అమల, ఏఎన్ఎంలు రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కుంగిన ఫ్లోరింగ్



- నిర్మించిన కొన్నినాళ్లకే..

నవతెలంగాణ-జుక్కల్

కట్టిన కొన్నేండ్లకే ఫ్లోరింగ్ కుంగిపోయింది. మండల కేంద్రంలో లక్షలు వెచ్చించి స్త్రీ శక్తి భవనాన్ని నిర్మించారు. అయితే నిర్మించిన కొన్ని రోజులకే భవనం మూలలకు చీలికలు వచ్చాయి. ఫ్లోరింగ్ నాణ్యతలోపంతో చేపట్టడంతో ప్రస్తుతం కుంగిపోయి నడవలేని దుస్థితి నెలకొంది. అలాగే మరుగుదొడ్ల వద్ద దుర్గంధం నెలకొనడంతో వివిధ గ్రామాల నుంచి సమావేశాలకు వచ్చే మహిళ సంఘాల సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు అంటున్నారు. నాణ్యత లోపంతో భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సిద్దాపూర్ రిజర్వాయర్‌తో
వేల ఎకరాలకు సాగునీరు

- పనులను పరిశీలించిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న స్పీకర్ పోచారం

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలం సిద్దాపూర్ గ్రామ సమీపంలో రూ.100 కోట్లతో నిర్మించే రిజర్వాయర్‌తో వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆ పనులను ఆయన పరిశీలించారు. ఈ రిజర్వాయర్ ద్వారా ఆయకట్టు రైతులకు నీటి కష్టాలు ఉండవని ఆయన తెలిపారు. పనులలో నాణ్యత ఉండాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. పనులను స్థానిక ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. ఆయనతో పాటు జడ్పీటీసీ హరిదాస్ నాయక్, ఇరిగేషన్ అధికారులు సర్పంచ్ కళ్యాబాయ్ దశరథ్ తదితరులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో కోరుట్ల పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ఉచిత పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ స్వామి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, పాల కేంద్రం అధ్యక్షుడు లక్ష్మా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి దేవేందర్ మాట్లాడుతూ కోరుట్ల పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఉచిత పశు వైద్య శిబిరం ఈనెల 25వ తేదీ నుంచి 31 తేదీ వరకు ప్రతి రోజు జిల్లా వ్యాప్తంగా 3 క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా జంతు హింస నివారణ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 31వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించినున్నట్టు, ఈ జంతు హింస నివారణ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉచిత పశువైద్య శిబిరంలో 46 పశువులకు గర్భకోశ సంబంధ చికిత్సలు, 15 పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధైధాకృష్ణ, రామకృష్ణ, డైరీ డీడీ ప్రవీణ్ కుమార్, బీఎంసీ చైర్మన్ లోహిత్‌రెడ్డి, కోరుట్ల పశువైద్య కళాశాలకు సంబంధించిన 21 మంది జూనియర్ వెటర్నరీ డాక్టర్లు, సంఘం సభ్యులు, పశువైద్య సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు మరింత కృషి చేస్తాం

నవతెలంగాణ-భిక్కనూర్

బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు మరింత కృషి చేస్తామని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి పట్టణ అధ్యక్షుడు అంబల్ల మల్లేశం తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బీఆర్ఎస్ పార్టీ 2023 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో నూతన సంవత్సరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ సర్పంచ్ తునికి వేణు, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఉప్పల బాబు, మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పురాం రాజమౌళి, సర్దార్ ఖాన్, రైతు విభాగపు నాయకులు జనార్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు సుబ్బారావు, గ్రామ వార్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఛలో గోద్రికి బయలుదేరిన గిరిజన నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మహారాష్ట్రలోని జలగావ్ జిల్లా గోద్రి గ్రామంలో నిర్వహిస్తున్న అఖిల భారతీయ హిందూ గోర్ బంజారా లాబానా, నాయకుడా సమాజ కుంభమేళ కార్యక్రమానికి ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి తండా గిరిజన నాయకులు తరలివెళ్లారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు జరిగే కార్యక్రమానికి తండవాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజం కొరకు, ధర్మం కొరకు, దేశం కొరకు, గిరిజన లాబాన సంస్కృతి సాంప్రదాయాలు బంజర జాతి స్థితిగతులు గురించి ఈ కుంభమేళా కార్యక్రమం చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ కుంభమేళాలో మహారాష్ట్ర పౌరదేవి పీఠాధిపతి బంజారా గురు బాబుసింగ్ మహారాజ్‌తోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి బంజారా లాబాన నాయకులు డాక్టర్ రాంసింగ్ నాయక్, తాన్ సింగ్, బాధ్య నాయక్, ఓంకార్ నాయక్, తిమ్మారెడ్డి తండా వాసులు రాములు, సర్పంచ్ శ్వేత సంతోష్, పీర్యా, రవి, సురేష్, వసంత్, మోహన్ తదితరులున్నారు.

డ్రోన్ స్ప్రేయర్‌తో పంట పొలాలకు మందు పిచికారీ సులువు

నవతెలంగాణ-రాజంపేట్

డ్రోన్ స్ప్రేయర్‌తో పంట పొలాలకు మందు పిచికారీ చేయడం సులువని ఏపీఎం సాయిలు పేర్కొన్నారు. శుక్రవారం మండల మహిళా సమైక్య కార్యాలయంలో మాట్లాడుతూ.. రాజంపేట్ మండల పరిధి గ్రామ రైతులెవరైనా డ్రోన్ స్ప్రేయర్‌తో పంటపొలాలకు మందు పిచికారీ చేయాలనుకుంటే మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పంట పొలాలకు మందు పిచికారీ చేయడానికి డ్రోన్ స్ప్రేయర్ ఉందని పేర్కొన్నారు. ఎవరికైనా అవసరం ఉన్నవారు ఏపీఎం సాయిలు: 8790990114 అకౌంటెంట్ ప్రశాంతి 9502610961 ఈ నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రేమికురాలి బంధువుల బెదిరింపులతోనే
శ్రీకాంత్ ఆత్మహత్య



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

- నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ రమేష్

నవతెలంగాణ-బోధన్

ఖండ్‌గాం గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి శ్రీకాంత్ 20) తాను ప్రేమించిన అమ్మాయి తరపు బంధువులు ఆయనను బెదిరించడంతోనే శ్రీకాంత్ భయపడి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడని నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 23నెలలో విద్యార్థి శ్రీకాంత్ కళాశాలకు వెళ్లి అదృశ్యమై బోధన్ శివారులోని పసుపువాగు వద్ద శవమై కనిపించిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. శుక్రవారం బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ రమేష్, శ్రీకాంత్ మృతి ఘటనపై విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 23న కళాశాలకు శ్రీకాంత్ వెళ్లాడని, కళాశాలకు వెళ్లిన కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆయన తండ్రి లక్ష్మణ్ సెప్టెంబర్ 24న బోధన రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, తిరుమలరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సూరి వెంకటరెడ్డి అనే వ్యక్తులపై తనకు అనుమానం ఉందని విద్యార్థి తండ్రి లక్ష్మణ్ వారిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కేసును విచారణ చేస్తున్న సందర్భంలో డిసెంబర్ 12న బోధన్ పట్టణ సమీపంలోని పసుపు వాగు వద్ద ఓ వ్యక్తి అస్థిపంజరం ఉందని ఫిర్యాదు రాగా విద్యార్థి కుటుంబ సభ్యులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి చూడగా అక్కడ ఒక బ్యాగు, జత చెప్పులు ఉండగా అవి తన కుమారుడికి చెందినవిగా విద్యార్థి తండ్రి నిర్ధారించారని, అస్తిపంజరం తన కుమారుడిదేనని ఆయన గుర్తించినట్టు పేర్కొన్నారు. ఈ ఘటనలో చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఆయన వెల్లడించారు. కేసు పరిశోధనలో భాగంగా నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ రమేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, బోధన్ పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ బృందం చేసి కేసును చేధించారు. ఈ కేసును ముందుగా బోధన్ పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ దర్యాప్తు చేయగా కేసు తీవ్రతను బట్టి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ నాగరాజు నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ రమేష్‌కు అప్పగించారు. కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలం ప్రకారం అన్నెం వెంకట్‌రెడ్డి సోదరి కుమార్తె(19) విద్యార్థి శ్రీకాంత్‌తో ప్రేమలో ఉండగా అది నచ్చని అమ్మాయి తల్లిదండ్రులు అన్నెం వెంకటరెడ్డికి ఈ విషయం చెప్పగా.. ఆయన తన స్నేహితులతో కలిసి మృతుడు శ్రీకాంత్‌కు ఫోన్ చేసి మాకు సంబంధించిన అమ్మాయిని ప్రేమ పేరుతో మాట్లాడవద్దని బెదిరించడం, బూతులు తిట్టడం చేశారని అంతేకాకుండా ఈ విషయం మీ తల్లిదండ్రులకు చెప్పి పరువు తీస్తామని బెదిరించడంతో మృతుడు శ్రీకాంత్ మనస్థాపం చెంది బోధన్ శివారులో గల పసుపు వాగు వద్దకు వెళ్లి వాగు వద్ద గల చింత చెట్టుకు తన బెల్టుతో ఉరివేసుకొని చనిపోయినట్లు పేర్కొన్నారు. కేసు పరిశోధనలో భాగంగా నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ రమేష్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, బోధన్ పట్టణ సీఐ ప్రేమ్ కుమార్ బృందం కేసును ఛేదించి నిందితులు అన్నెం వెంకటేశ్వర్‌రెడ్డి, దేసిరెడ్డి పాపిరెడ్డి, సూర వెంకటేశ్వర్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, పల్లె తిరుమలరెడ్డిని అదుపులోకి తీసుకుని రిమాండ్ చేస్తున్నట్టు సీసీఎస్ ఏసీపీ రమేష్ తెలిపారు. సమావేశంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

మోడీ కేసీఆర్ పాలనలో
ప్రజలు విసుగు చెందారు

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

మోడీ కేసీఆర్ పాలనలో ప్రజలు విసుగు చెందారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి పట్టణం నుంచి పెద్ద ఎత్తున మహిళలు షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. దేశంలో మోడీ పాలన రాష్ట్రంలో కేసీఆర్ పాలనలో విసిగి ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని తెలిపారు. బీజేపీ-ముక్త్ భారత్ నినాదంతో కేసీఆర్ ప్రజలను మోసం చేయాలని చూస్తుంటే, కాషాయ పార్టీ మతకల్లోలాలు సృష్టించి ఉప ఎన్నికల్లో గెలవాలని చూస్తోందన్నారు. తెలంగాణ మోడల్, గుజరాత్ మోడల్ గురించి చర్చ జరగాలని, తెలంగాణ మోడల్ అంటే అవినీతి, ల్యాండ్ మాఫియా, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, డ్రగ్ మాఫియా, గుజరాత్ మోడల్ అంటే.. గుజరాత్ మారణహోమంలో 270 మంది హిందువులు, 2వేల మంది ముస్లింలు, 2లక్షల మంది నిరాశ్రయులయ్యారని గుర్తుచేశారు. గుజరాత్ మోడల్‌ను తీసుకొచ్చి ఇక్కడ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ భావిస్తుందని విమర్శించారు.



కాంగ్రెస్‌లో చేరిన పలువురు

ఎముకలు కొరికే చలిలో సైతం రాహుల్ జోడో యాత్ర చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో హాత్‌సేహాత్ జోడో అభియాన్ కార్యక్రమం మొదలు పెట్టామని తెలిపారు. దేశంలో విచ్ఛిన్నకర శక్తులకు భయపడకుండా రాహుల్ ప్రాణాలకు తెగించి యాత్ర చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పార్టీ ప్రతిష్టను పెంచేలా సందేశాన్ని హాత్‌సేహాత్ జోడో కార్యక్రమం ద్వారా తీసుకెళ్ళాల్సిన బాధ్యత మన అందరీపై ఉందన్నారు. ధరణితో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తే వాటిని తిరిగి చేర్పించాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలో విపత్కర పరిస్థితులను పునరావృత్తం కాబోతున్నాయని ఆందోళన వ్యక్తం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కైలా శ్రీనివాస్‌రావు, పండ్ల రాజు, గుడుగుల శ్రీనివాస్, చంద్రకాంత్ రెడ్డి, భీమ్‌రెడ్డి, లింగారెడ్డి, ఇలియాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు మల్యాద్రిరెడ్డి క్షమాపణ చెప్పాలి

- టీఆర్ఎస్ శ్రేణులు

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి లేదంటూ పనికిరాని ఆరోపణలు చేస్తున్న మల్యాద్రిరెడ్డి వెంటనే స్పీకర్ పోచారం కుటుంబానికి క్షమాపణ చెప్పాలని వర్ని, చందూర్, మోస్రా, రుద్రూర్ మండలాల టీఆర్ఎస్ శ్రేణులు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బాన్సువాడ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని సంబంధం లేని విషయాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేసిన మల్యాదిరెడ్డిని తరిమి కొడతామని ఖబర్దార్ అంటూ టీఆర్ఎస్ శ్రేణులు హెచ్చరించారు. నియోజకవర్గంలో మీ స్థాయి ఎంత అని ప్రశ్నించారు. అసలు సొంత గ్రామంలో కనీసం వార్డు మెంబర్ కూడా గెలువని వ్యక్తి మల్యాద్రిరెడ్డి అని విమర్శించారు. మల్యాద్రిరెడ్డి వెంటనే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి, తన తనయులకు క్షమాపణ చెప్పి తీరాల్సిందేనని హెచ్చరించారు.



మాట్లాడుతున్న నాయకులు

సమావేశంలో సీనియర్ నాయకులు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్ల శ్రీరాములు, మండలాధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, చందూర్ సర్పంచ్ కర్లం సాయిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ ప్యారం అశోక్, బొడ్డెళ్ల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బాలరాజు, నామాల సాయిబాబా, మేక బుజ్జి అన్న, మేక వీర్రాజు, రైతుబంధు అధ్యక్షులు గంగారం, నాగభూషణం, సర్పంచులు సత్తిబాబు, శ్రీనగర్ రాజు, దేవిసింగ్, మేడిపల్లి రవి, సర్పంచ్ నరేందర్ రెడ్డి, విమల లింగయ్య, సున్నం భూమయ్య, టీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పోరాడాలి

నవతెలంగాణ-బోధన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలకు ప్రభుత్వం మంజూరి చేస్తున్న నిధులు అరకొరగా ఉన్నాయని కావున భవన నిర్మాణ కార్మికుల నిధుల పెంపుదలకై పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బి.మల్లేష్ పిలుపునిచ్చారు. శనివారం బోధన్ పట్టణంలోని వీరేశలింగం పార్కులో నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల మెరుగుదలకై తెలంగాణ ప్రగతిశీల భవనం ఇతర నిర్మాణ కార్మిక సంఘం జనవరి 20 నుంచి 30 వరకు ప్రచార క్యాంపెయిన్‌ను నిర్వహించాలని పిలుపునిచ్చారని తెలిపారు. కార్మికుడి సహజ మరణానికి లక్ష 30 వేల రూపాయల నుంచి 5 లక్షలకు పెంచాలని, ప్రమాదావశాత్తు మరణిస్తే ఆరు లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచాలని, శాశ్వత అంగవైకల్యానికి 10 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండ్లి కానుక ప్రసూతి సహాయం 30 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచాలని, 60 సంవత్సరాలు నిండిన వారికి రూ.6వేల పెన్షన్ సౌకర్యం



మాట్లాడుతున్న మల్లేష్

కల్పించాలని, ఆసుపత్రిలో లేదా వైద్య సహాయంలో ఆరు నెలల పాటు రోజుకు 300 రూపాయలు చొప్పున ఇవ్వాలని, కార్మిక శాఖ కార్డులు లేని వారికి కార్మిక శాఖ ద్వారా ప్రత్యేక డ్రైవ్‌తో కార్డులు అందించాలని, చదువుకునే కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, ఇల్లు లేని వారికి డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లు, సొంత స్థలం ఉన్న వారికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని, కార్మిక శాఖ కార్యాలయంలో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, కొత్త రేషన్ కార్డులకు లేబర్ కార్డు నిబంధనలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియూ నాయకులు మేస్త్రి తన్వీర్, హసీమ్, ఇమామ్, అబ్దుల్, సూరి, బాబు, సాయన్న, లింగారెడ్డి, జమాల్, చింతం గంగయ్య సలీం తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి విధానంపై అవగాహన

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆరేపల్లి గ్రామంలో రైతులకు కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, పద్మపాని సొసైటీ ఆధ్వర్యంలో వరిలో తడి పొడి విధానంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట కోఆర్డినేటర్ గడ్డం వినోద్ మాట్లాడుతూ.. వరి రసాగులో తడి పొడి విధానం వల్ల కలుగు లాభాలను వివరించారు. నీటి వినియోగం తక్కువగా ఉండడానికి నీటి కొలతకు రైతులకు పైపులను అందజేసినట్టు ఆయన తెలిపారు. తడి పొడి విధానం ద్వారా సాగు చేస్తే కాలుష్య కారకాలైనటువంటి మిథేన్ వాయువు తగ్గుతుందని పంట దిగుబడి పెరుగుతుందని ఆయన సూచించారు. దీనితో దోమపోటు చీడపీడల ఉధృతి తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలయ్య, వార్డ్ మెంబర్ శ్రీలత, కారోబార్ సోపాన్, రైతులు వెంకట్రావు, భూంరావు, ఈశ్వర్ రావు భాస్కర్‌రావు, రెస్మాయి సురేష్, పెర్క లక్ష్మణ్, గొల్ల అనిల్, గొల్ల ప్రశాంత్, భూమయ్య పాల్గొన్నారు.

ఆత్మహత్యలతో బంగారు భవిష్యత్తును వృథా చేసుకోవద్దు

- మేము మీతో ఉంటాం
- టీఎన్జీవోఎస్ భరోసా

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆత్మహత్యలతో బంగారు భవిష్యత్తును వృథా చేసుకోవద్దని మేము మీతో ఉంటామని ఉద్యోగులకు ఉద్యోగుల జేఏసీ సంఘం నాయకులు భరోసా ఇచ్చారు. నీటిపారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారావు మరణానికి చింతిస్తూ శుక్రవారం నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ జిల్లా కార్యాలయంలో సంస్మరణ సభ ఏర్పాటుచేశారు. టీఎన్జీవోఎస్, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్, జిల్లా కార్యదర్శి అమృతసాగర్, నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్లు బద్రీనాథ్, యశస్విని, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ ఉదయ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, ఉద్యోగులు హాజరై రమణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా అలుక కిషన్ మాట్లాడుతూ... ఉద్యోగ విధుల్లో గాని, వైవాహిక జీవితంలో గల ఒత్తిడి నిరాశ, నిస్పృహలకులోనై బంగారు జీవితాన్ని అర్ధాంతరంగా ముగించడం అత్యంత బాధాకరమైన విషయమని అన్నారు. ఇకముందైనా అధికారులు, ఉద్యోగులందరూ సంఘటితంగా హక్కుల సాధనకు పోరాడటానికి కలిసి రావాలని అన్నారు.

ఉప్లూర్‌లో అన్నదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లోగల శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బద్దం సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవ ఉత్సవాలను నాలుగు రోజులనుండి నిర్వహిస్తున్నారు. స్వామివారి కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



అన్నదానంలో పాల్గొన్న పలువురు

విద్యార్థుల్లో విజన్ పెంచేందుకే పరీక్ష పే చర్చ

బీజేపీ జిల్లా అధ్యక్షులు బస్వ లక్ష్మి నర్సయ్య

నవతెలంగాణ-నవీపేట్

భావి భారత భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని, అందుకే వారిలో విజన్ పెంచేందుకే పరీక్ష పే చర్చ కార్యక్ర మాన్ని ప్రధాన మంత్రి మోడీ చేపట్టారని అన్నారు. మండలంలోని జన్నేపల్లి ఎస్ ఎస్ ఆర్ పాఠశాలలో శుక్రవారం పరీక్ష పే చర్చ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా బీజెపి జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు పరీక్షల ఒత్తిడిని ఎలా జయించాలో ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారని అన్నారు. ప్రధానమంత్రి మోడీ ముందు చూపు ఉన్న నాయకుడని విద్యార్థులు సైతం తమ జీవిత లక్ష్యంపై ముందస్తు అవగాహన పెంపొందించుకోవాలని వడ్డీ మోహన్ రెడ్డి అన్నారు. అనంతరం ఆర్ట్స్ అండ్ డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మండల అధ్యక్షులు ఆదినాథ్, సర్పంచ్ సరీన్, ఎంపీటీసీ రాధా, వడ్డేపల్లి సర్పంచ్ శ్రీధర్, సీనియర్ నాయకులు మువ్వ నాగేశ్వరరావు, వంశీ మోహన్, రామకృష్ణ, రచ్చ సుదర్శన్, రమణారావు, సత్యం రెడ్డి, భూషణ్, ప్రదీప్, మల్లెపూల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటాం

ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలని, యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, నూతన మహిళా వసతి గృహం నిర్మించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ బచ్చనబోయిన శివ మాట్లాడుతూ.. యూనివర్సిటీ సమస్యలు తీర్చకుండా జిల్లాకు వస్తున్న కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని వివరించారు. తెలంగాణ యూనివర్సిటీకి ప్రత్యేక బడ్జెట్ పెట్టి అభివృద్ధి చేయాలని లేకపోతే సీఎం మంత్రులు ఎమ్మెల్యే లను అడ్డుకుంటమని అన్నారు. ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, విద్యాహక్కు చట్టం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, యూనివర్సిటీలో 3వేల మంది విద్యార్థులు సామర్థ్యం గల ఆడిటోరియం నిర్మించాలని, యూనివర్సిటి లో ఖాళీగా ఉన్న టీచింగ్ ,నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని,యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టాలని, ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలనీ తెలిపారు. పేపర్ ప్రకటనకు మాత్రమే ఉద్యోగ నోటిఫికేషన్ పరిమితం కాకుండా, ఉద్యోగ క్యాలెండర్ ను విడుదల చేయాలని లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇందూరు విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్ నవీన్, ఇందూరు జిల్లా ఎస్ ఎఫ్ డి ఎస్ ఎఫ్ డి కన్వీనర్ ప్రమోద్ , ఎగ్జిక్యూటివ్ నెంబర్ , శ్రావణ్ , తదితరులు పాల్గొన్నారు.

మచ్చర్ల గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్



ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ కల్యాణ లక్ష్మి చెక్కులను ఎంపీపీ పస్కనర్సయ్య చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ గంజి నర్సయ్య, ఉపసర్పంచ్ సందుల గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల కుటుంబాలను అన్నిరకాలుగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, పీయూసీ చైర్మన్ ఆశన్న గారి జీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాజశేఖర్ వివరాల ప్రకారం.. అంగాల్ల రమేష్ (36) గ్రామంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుకు నేవాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో తన ఇంట్లోని బెడ్ రూంలో లుంగీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు చేయగా ఘటనా స్థలాన్ని సందర్శించారు. పంచానామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుచేయాలి

- పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయాలి
- తెలంగాణ యూనివర్సిటీకి 500 కోట్లు కేటాయించాలి
- కేటీఆర్‌ను అడ్డుకుంటాం
- ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

విద్యారంగాన్ని అభివృద్ధి అభివృద్ధి చేయకుండా నిజామాబాద్‌కు వస్తున్న కేటీఆర్‌ను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని విస్మరించడం దారుణమని అన్నారు. నిజామాబాద్ జిల్లాకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కొత్త హంగులతో ఏర్పాటుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వస్తున్న కేటీఆర్‌ని అడ్డుకుంటామని అన్నారు. మన ఊరు - మనబడి పథకం కింద అన్ని పాఠశాలలను చేర్చి అధిక బడ్జెట్‌ని కేటాయించాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలను మూడు వేలకు పెంచాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, సిద్దల నాగరాజు, జిల్లా నాయకులు జవహర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ:జిల్లాకు మహిళా డిగ్రీ కాలేజీ కేటాయించాలని, పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయాలని, తెలంగాణ యూనివర్సిటీకి 500 కోట్లు కేటాయించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నగర కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లి ఎన్ఆర్ భవన్ లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నిజామాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె. అషర్, నవీన్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో ఉన్న విద్యార్థినులు చదువుకోడానికి ఎక్కువ ఆసక్తిని చూపుతున్నారని, వారికి ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలు అందుబాటులో లేకపోవడం బాధాకరమని అన్నారు. వెంటనే జిల్లాకు మహిళ డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కాలేజీలు లేకపోవడం వల్ల చాలా మంది విద్యార్థులు టెక్నికల్ గా చదువుకు దూరం అవుతున్నారని, వెంటనే నిజామాబాద్ నగరంలో గల పాలిటెక్నిక్ కాలేజీని ఇంజనీరింగ్ కాలేజీ గా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న మంత్రి కేటీఆర్ జిల్లాలో పలు ప్రారంభ కార్యక్రమాలకు వస్తున్నారని వీటితోపాటు నిజామబాద్‌లోని విద్యారంగ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ లేకపోవడంతో ఎంతోమంది ప్రతిభ కలిగిన నిరుపేద, పేదమధ్యతరగతి విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే జిల్లాకు ఒక ఇంజనీరింగ్ కాలేజీని మంజూరు చేస్తే పేద, మధ్యతరగతి విద్యార్థులకు మేలు జరుగుతుందని అన్నారు.

జిల్లాకు మహిళా డిగ్రీ కాలేజీ లేకపోవడంతో మహిళ విద్యార్థినిలు విద్యను దూరం చేసుకునే పరిస్థితి కలిగిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించి జిల్లాకు మహిళా డిగ్రీ కాలేజీ కేటాయించాలని కోరారు. జిల్లాలో వసతి గృహాల పరిస్థితి అధ్వానంగా మారిందని, నూతన వసతి భవనాలను నిర్మించాలని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో 30 శాతం నిధులను విద్యకు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీకి 500 కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు మహిపాల్, నగర కోశాధికారి తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విఘ్నేష్

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జడ్పీటీసీ, తదితరులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామ పరిధిలోని లొంకతండా లో శుక్రవారం జగదాంబ దేవి, సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.జడ్పిటిసి మాన్‌సింగ్ నాయక్, తాండా పెద్ద మనుషులు బట్టు ప్రభు నాయక్, బనావత్ కిట్టు నాయక్, బానావత్ అంబర్య నాయక్, బట్టు జహర్ లాల్, బట్టు లచ్చిరామ్, మాజీ ఎంపీటీసీ మోహన్, బట్టు మారుతి, సర్పంచ్ దానెం లక్ష్మితిరుపతి, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నర్సారెడ్డి, జీల్ల మలేష్, రాజ పండరి, తండా యువకులు బనావత్ వినోద్ నాయక్, బట్టు వినోద్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్యలో వసంత పంచమి వేడుకలు



పలకలు అందజేసిన పాఠశాల యాజమాన్యం

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని దుబ్బాక గ్రామంలోని శ్రీ విద్య పాఠశాల యాజమాన్యం వసంత పంచమి పురస్కరించుకొని శుక్రవారం చదువుల తల్లి సరస్వతి దేవికి ప్రత్యేక ప్రార్ధనలు చేసి అనంతరం విద్యార్థులకు పలకలు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సాయి కృష్ణ, చైర్మెన్ గోజురి నడిపి గంగాధర్, ఉపాధ్యాయులు మనోజ్ఞ, మమత, కృష్ణ వేణి, మానస, సుప్రియ, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాలలో ఖోఖో స్పోర్ట్స్ మీట్



విద్యార్థులకు మెమొంటోలను అందజేసిన కృష్ణవేణి యాజమాన్యం

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ కృష్ణవేణి (కేటీఎస్) పాఠశాలలో ఖోఖో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఖోఖో, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ చూపిన పాఠశాల విద్యార్థులకు మెమొంటోలను అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ చవాన్ రాజేందర్ మాట్లాడుతూ... విద్యార్థులు కేవలం చదువుపైనే కాకుండా క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటూ ముందుకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శాఖని నర్సయ్య, వైస్ ప్రిన్సిపాల్ కోట ప్రవీణ్, డైరెక్టర్ ఎస్. రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపట్ల హర్షం

ప్రొసీడింగ్ కాపీల అందజేత



ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గంగపుత్ర ఫంక్షన్ హాల్, గంగమ్మ ఆలయం దగ్గర చెరువు దగ్గర బతుకమ్మ కోసం, గణపతి నిమజ్జనం, గంగమ్మ శివాయంకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో లక్షా 50 వేల రూపాయలను మంజూరుచేశారు. ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహకారంతో ఇందల్ వాయి జడ్పీ టీసి గడ్డం సుమన రవిరెడ్డి కి అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని శుక్రవారం సహకార సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి, ఎంపిటిసి మారంపల్లి సుధాకర్, డీసీసీబీ డైరెక్టర్ కొరట్‌పల్లి ఆనంద్ ఆధ్వర్యంలో గంగపుత్రులకు అందజేశారు. అడిగిన వెంటనే నిధులను మంజూరు చేయడంపట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజేందర్, సీనియర్ నాయకులు పాశంకుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు కాశీరాం, సంఘ సభ్యులు లింగారెడ్డి, బెస్త రమేష్, నాగభై గంగాధర్, ముత్యపు సాగర్, మారంపల్లి వినోద్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లా పరిషత్ చైర్మన్ డి.విఠల్‌రావు



కంటిపరీక్షలు చేయించుకుంటున్న జడ్పీచైర్మన్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిక్లీ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు శుక్రవారం రిబ్బన్ కట్ చేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విఠల్ రావు మాట్లాడుతూ ప్రజలు కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నా ఆస్పత్రుల వైపు చూడటం చాలా తక్కువన్నారు. ఇతర వ్యాధితో పోల్చుకుంటే కంటి సమస్యను పెద్దగా పట్టించుకోరని గ్రహించి 18 సంవత్సరాల వయస్సు పై బడిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించటం చాలా శుభపరిణామామని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుండు రవి, ఎంపీటీసీ కారం సుజాతనవీన్, ఎంపీడీఓ క్రాంతి, ఎంపీవో తోపారం శ్రీనివాస్, మండల వైద్యాధికారిని సరిత, క్యాంపు మెడికల్ ఆఫీసర్ శ్రీరామ్ యాదవ్, సిహెచ్వో ఆనంద్ కుమార్, హెచ్ఎస్ సుధాకర్, పీఎంవోఎస్ లక్ష్మినర్సయ్య, ఏఎన్ఎంలు, వార్డు మెంబర్లు ద్యాగ నరేష్, బురోళ్ల దేవయి, రాజశేఖర్, ఎగంటి తులశమ్మ, తెరాస యువ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, అంగన్వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు నాల్గొన్నారు.

టీఆర్ఎస్ హామీలు అమలు చేయాలి : సీపీఐ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

టీఆర్ఎస్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రజానికం సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో బహిరంగ లేఖను శుక్రవారం విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్, పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ నిజామాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి విచ్చేస్తున్న సందర్భంగా మంత్రికి బహిరంగ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో గత 9 సంవత్సరాల క్రితం ఎన్నికల మేనిఫెస్టోలో టీఆర్ఎస్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రజానీకం సమస్యలు పరిష్కరించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో తెరిపిస్తామన్న బోధన్ ఎన్ఎస్ఎఫ్ షుగర్ ఫ్యాక్టరీ హామీ ఇచ్చి మాట తప్పారని అన్నారు. సారంగాపూర్ ఎన్సీఎస్ఎఫ్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని, నిజామాబాద్ జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, పీఎఫ్ కలిగి ఉన్న బీడీ కార్మికులందరికీ ఆంక్షలు లేకుండా బీడీకార్మికభృతి పెన్షన్లు ఇవ్వాలని అన్నారు. విద్యుత్ ఏసిడి చార్జీలను రద్దు చేయాలని, 2023 ఏప్రిల్ నుండి డిస్కంలు ప్రతినెల పెంచనున్న కరెంటు చార్జీల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ నగరంలో ఎన్నో సంవత్సరాలుగా అసంపూర్తిగా నడుస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీని త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేసి అందర్నీ రెగ్యులర్ చేయాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, రైతాంగానికి ఒకేసారి లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని అన్నారు. పేదలందరికీ ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని, 57 సంవత్సరాలు దాటిన వారందరికీ పెన్షన్ ఇవ్వాలని, వృద్ధులందరికీ పెన్షన్ ఇవ్వాలని, దళితులందరికీ మూడెకరాల భూమి, పేదలందరికీ భూపంపిణీ చేయాలని అన్నారు. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను నిజామాబాద్ లో మంజూరు చేయాలని డిమాండ్లతో పాటు తెలంగాణ ప్రజలకు నిజామాబాద్ ప్రజానీకానికి బీఆర్ఎస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాల్సిందిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య ఎండి.రఫీక్ ఖాన్, రంజిత్, సురేష్, ఆనంద్ పాల్గొన్నారు.



బహిరంగ లేఖను విడుదల చేసిన నాయకులు

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి



ఆశన్నగారి రాజేశ్వర్ రాజేశ్వర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆస్పత్రివారు



ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

వైద్యులు దేవునితో సమానమని, కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఎంతోమంది ప్రజలను రక్షించిన డాక్టర్ల సేవలు వెలకట్టలేనివని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మహాలక్ష్మి కాలనీ నిత్య ఈఎన్ టీ కేర్ హాస్పిటల్ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెవి ముక్కు, గొంతు శస్త్ర చికిత్స వైద్య నిపుణులు సీఎస్ చైతన్య సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ గంట సదానందం, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా, బీఆర్ఎస్ నాయకులు పండిత్ పవన్, చైతన్య దివ్య, మేనేజర్ షేక్ అసీం, పట్టణానికి చెందిన ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సీసీగా వర్ణం శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాసమందర్ క్లస్టర్‌లో పనిచేస్తున్న వర్ణం శ్రీనివాస్ జిల్లా స్థాయిలో ఉత్తమ సీసీగా ఎంపికైనట్లు సెర్ప్ ఏపీఎం కుంట గంగారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నారాయణ రెడ్డి ప్రశంసా పత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేయడం, సంస్థాగత నిర్మాణం, కొత్త వ్యాపారాలను ప్రోత్సహించడం, కోనాపూర్, కొనసముందర్ గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను నిర్వహించడం వంటి అంశాల్లో రాణించినందుకు జిల్లా స్థాయి ఉత్తమ సీసీగా ఎంపికైనట్లు ఏపీఎం తెలిపారు.కాగా కమ్మర్ పల్లి మండల సమాఖ్య కు చెందిన ఏపీఎం కుంట గంగారెడ్డికి ఇదివరకే మూడుసార్లు ఉత్తమ ఏపీఎంగా అవార్డు పొందగా, ఉత్తమ సీసీలుగా వర్ణం శ్రీనివాస్ ఎంపిక కావడం కూడా ఇది మూడోది కావడం విశేషం.



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

30న చలో ఎస్పీడీ కార్యాలయం

- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్‌కు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఈనెల 30న జరిగే చలో ఎస్‌పాడి కార్యాలయం పిలుపును జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ అన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి కేజీబీవీలో పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ... కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్స్ కు ఇప్పటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ లాంటి ఆరోగ్య, ఉద్యోగ భద్రత పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.60 కూడా వీరికి అమలు కావడం లేదన్నారు. పని భారం పెరిగినా ఖాళీలు భర్తీ చేయడం లేదన్నారు. కేజీబీవీల్లో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ ఇవ్వడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ లో పనిచేసిన సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో సర్వీస్ వెయిటేజీ ఇవ్వాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 30న హైదరాబాదులోని స్టేట్ ప్రాజెక్టు ఆఫీసర్ (ఎస్పీడీ) కార్యాలయం ముందు యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నా మన్నారు. జిల్లాలోని కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మురళి, కేజీబీవీ సిబ్బంది సుజాత, పద్మ, భాగ్య, శ్రీకన్య, చంద్రకళ, జమున, గీత, మంజుల పాల్గొన్నారు.



చలో ఎస్పీడీ కార్యాలయం వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కేజీబీవీ సిబ్బంది

బషీరాబాద్‌లో శుక్రవారం దేవి పల్లకి ఊరేగింపు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ లో శుక్రవారం దేవి జాతర ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రంత్రవారం దేవి పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి వసంతోత్సవం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుండి గ్రామం వరకు అమ్మవారి పల్లకి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు అమ్మవారికి బోలెల నైవేద్యం వేసి, తియ్యని వంటలు చేసుకుని సామూహిక భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పోలీసు విద్యా సాగర్ లావణ్య దంపతులు, బక్కన్న, రమేష్, శేఖర్, వినోద్, నారాయణ, ముత్తెన్న, దేవదాస్, అశోక్, నరేష్, దేవి దీక్ష భక్తులు, గ్రామ అభివృద్ధి సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక అభివృద్ధి కోసం బడ్జెట్ కేటాయించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అభివృద్ధి చెందుతున్న భారత దేశంలో బడ్జెట్ కేటాయింపులు చాలా కీలకంగా మారుతాయని బడ్జెట్లో క్యాపిటల్ బడ్జెట్, రెవెన్యూ బడ్జెట్ అనే రెండు ప్రధాన భాగాలుగా ఉంటాయని, బడ్జెట్ కేటాయింపులు దేశాభివృద్ధికి దారులు వేస్తున్నాయని అర్థశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ సంపత్ తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీలో అర్థశాస్త్ర విభాగంలో ప్రీ బడ్జెట్ ఎనాలసిస్ సింపోసిజం అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బడ్జెట్‌లో పెట్టుబడి పద్దు, నిర్వహణ పద్దు అనే రెండు కేటాయిస్తారని, పెట్టుబడి పద్ధతి కి అధికంగా బడ్జెట్ కేటాయించి నట్లయితే దీర్ఘకాలంలో అభివృద్ధి చెందుతుందని డాక్టర్ పున్నయ్య విశ్లేషించారు. దేశ ప్రజల అభివృద్ధి కోసం బడ్జెట్ కేటాయింపులు ఉండాలని డాక్టర్ స్వప్న తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ దత్త హరి, డాక్టర్ ప్రభంజన్,డాక్టర్ రామలింగం ,డాక్టర్ నర్సయ్య ,డాక్టర్ ప్రవీణ్ ,డాక్టర్ మోహన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.